telugubooks

# తప్పులెన్నువాడు...

ఆఫీస్ నించి అలసిపోయి ఇంటికి చేరుకున్నాడు రాజారావ్.

హాల్లో కుర్చీలో నీరసంగా కూలబడ్డ భర్తకి కాఫీ తీసుకొచ్చి అందించింది రమణి.

అతను కాఫీ తాగుతుంటే అతని కాళ్ళ దగ్గర కూర్చుని బూట్లు విప్పసాగింది ఆమె.

—ఆమె బూట్లను విప్పడం, అతను కాఫీ కప్పుని ఖాళీ చేయడం ఒకేసారి జరిగాయి.

కప్పుని కింద పెట్టబోతున్న రాజారావ్‌కి ఎదురు కుర్చీకింద కాల్చి పారేసిన సిగరెట్ ముక్క కనిపించింది.

అంటే - రాఘవ మళ్ళీ వచ్చాడన్నమాట!

అతని మనసంతా చికాకైపోయింది.

ఎంత మేనత్త కొడుకైతే మాత్రం అంత తరచుగా వచ్చిపోతుండాలా? అదీ తను లేనప్పుడు!

అతనికి బుద్ధి లేకపోతే రమణి బుద్ధేమయింది? ఆయన లేనప్పుడు రావడం బావుండదు, ఆయన వున్నప్పుడే రమ్మని గట్టిగా చెప్పొచ్చుగా?

అంత ఒకళ్ళని చూడకుండా మరొకళ్ళు వుండలేని వాళ్ళే అయితే పెళ్ళి చేసుకోవలసింది.

వెంటనే అతనికి రమణి మాటలు గుర్తుకొచ్చాయి - తనని పెళ్ళి చేసుకోవాలని రాఘవ కెంతో వుండేదని, పెద్దల పట్టుదలల కారణాన అది జరగలేదని!

ఆలోచించిన కొద్ది రాజారావు బుర్ర వేడెక్కి పోసాగింది.

ఆఫీస్‌లో కొట్టుకుని కొట్టుకొని ఇంటికి చేరేసరికి ఇక్కడ అంత కన్నా భరించలేని వాతావరణం!

చటుక్కున కుర్చీలోంచి లేచి చెప్పులు తొడుక్కుని బయటికి బయల్దేరాడు.

"అదేమిటండీ, ఇప్పుడేగా వచ్చింది? అప్పుడే ఎక్కడికి బయల్దేరారు?...." ఆశ్చర్యంగా అడిగింది రమణి.

ఆమెకు జవాబియ్యాలనికూడా అనిపించలేదు రాజారావుకి. చరచరా ముందుకి కదిలాడు.

* * *

అలా అలా రోడ్లవెంట ఎంత సేపు తిరిగాడో తనకే అర్థం కాలేదు రాజారావుకి.

పార్కులో కూర్చోవాలనిపించింది. ఒంటరిగా కూర్చుంటే ఆలోచన్ల బాధ మరింత ఎక్కువైంది.

సినిమాకి వెళ్ళాలనిపించలేదు

ఏం చేయాలో పాలుపోలేదు.

కాళ్ళు నొప్పులు పుట్టేంతవరకూ తిరుగుతూనే వున్నాడు.

హఠాత్తుగా నిర్మల గుర్తుకొచ్చింది అతనికి. కాలేజీలో ఇద్దరూ క్లాస్‌మేట్స్ ఒకళ్ళంటే మరొకళ్ళకి - ఇద్దరికీ గౌరవం ఉంది. ఆమె

ఇంటికి వెళ్ళి కాసేపు కూర్చుంటే మనసుకి స్థిమితం చిక్కుతుందేమోననిపించింది రాజారావుకి.

ఆ ఆలోచన రావడమే తడవుగా వాళ్ళింటివేపు బయల్దేరాడు.

అతను వెళ్ళేసరికి నిర్మల ఒక్కతే సోఫాలో కూర్చుని ఏదో పుస్తకాన్ని తిరగేస్తోంది.

అతన్ని చూడగానే తడబడుతూ లేచి నిలబడింది. "రండి.... రండి...." ఆమె పలకరింపులో ఏదో అసహజత్వం గోచరించింది రాజారావుకి.

తన మనసు చిరాకుగా వుంది కాబట్టి, తనకన్నీ అలాగే అనిపిస్తున్నాయి కాబోలునని సరిపెట్టుకుని కుర్చీలో కూర్చున్నాడు రాజారావు.

నిర్మల మాత్రం కూర్చోలేదు. అలాగే నిలుచుంది.

ఆమె ప్రవర్తన వింతగా తోచింది అతనికి. ఎప్పుడూ ఎంతో ఆప్యాయంగా పలకరించే ఈమెలో ఈ మార్పేమిటి?!

"భాస్కర్‌గారు రాలేదా?" అడిగాడు తనే.

"ఆఫీస్‌నించి వచ్చారు. ఏదో పనిమీద బయటికి వెళ్ళారు...."

మాటి మాటికీ బయటికి చూస్తూ తడబాటుగా మాట్లాడుతున్న ఆమె తీరు అతనికి అర్థం కావడం లేదు.

నిర్మల ఎందుకు ఇలా ప్రవర్తిస్తోంది? తనిలా రావడం ఆమెకు ఇష్టం లేదా? ఇష్టం లేకపోవడానికి ఆమెకు కష్టం కలిగించేటట్లు తనేం చేస్తున్నాడు?

ఇక అక్కడ కూర్చోబుద్ధికాలేదు అతనికి. లేచి నిలబడ్డాడు.

"కూర్చోండి, అప్పుడే బయల్దేరారేం? ఆయన ఇప్పుడే వస్తానన్నారు, కూర్చోండి."

నిర్మల మాటలు రాజారావుకి మరింత కష్టం కలిగించాయి. తనకి ఎక్కువ పరిచయం ఎవరితో- నిర్మలతోనా? ఆమె భర్తతోనా? అసలు నిర్మల ఎందుకిలా ప్రవర్తిస్తోంది?

"అలా పోతూపోతూ వచ్చాను. మళ్ళీ తీరిగ్గా వస్తానెండి...." బయల్దేరాడు రాజారావు.

"రాజారావుగారూ!..." రెండడుగులు వేశాడో లేదో వెనకనుంచి వినిపించిన నిర్మల కేక అతనిని నిలిపేసింది.

ఏమిటన్నట్లు వెనక్కి తిరిగాడు.

నిర్మల దగ్గరగా వచ్చింది.

"సారీ! మిమ్మల్ని నొప్పించాను. మీరెంత మంచివారో నాకు తెలుసు. నేనంటే మీకున్న అభిమానంకూడా నాకు తెలుసు. తెలియనిదల్లా మావారికే! ఆయన ఇప్పుడు నా అర్ధభాగం కదా-సర్వహక్కులూ నామీద వున్నాయ్. నా స్నేహితులతో నేను మాట్లాడినా తప్పని వాదించే హక్కుంది ఆయనకి. మాట్లాడవద్దని శాసించే అధికారం కూడా వుంది. ఏ అధికారం లేనిదాన్ని నేను, నన్ను క్షమించండి...." అంతవరకూ బిగపట్టిన కన్నీరు ఆమె బుగ్గలమీదనుంచి కిందకి వురికింది.

ఛ....కేవలం మాట్లాడితేనే అంత అనుమానంతో వేగిపోతున్నాడా నిర్మల భర్త?! అనవసరంగా తనవల్ల ఆమెకు ఇబ్బంది. ఇంక మళ్ళీ నిర్మల ఇంటికి రాకూడదు....

"సారీ నిర్మలా!........నాకు తెలీకుండా నీకిబ్బంది కలిగించాను." గబగబా ముందుకి బయల్దేరాడు.

అతని మనసంతా నిర్మల భర్త మీద కోపంతో నిండిపోయింది. నిర్మలతో మాట్లాడితేనే ఆమె భర్త అంత నీచంగా ఆలోచిస్తున్నాడా అని

అతన్ని అసహ్యించుకుంటున్నాడే గాని- తనూ రమణిని ఇలాగే అనుమానిస్తున్నారనే ఆలోచన తనకి రాలేదు.

అతను బయటపడిపోయాడు, తను బయట పడలేదు. అంతే తామిద్దరి మధ్య తేడా అని కూడా తను గమనించడం లేదు.

ఒకవిధంగా తనకన్నా అతనే నయమని, మనసులోవున్న విషాన్నంతటినీ బయటికి కక్కేశాడని .... తనలా మనసులో ఎన్నో విపరీత ఆలోచనలు పెట్టుకొని బయటికి మామూలుగా వుండడం చేతకాకపోవడమే. అతనిలో 'మంచితనం' లేకపోవడం అని తను ఆలోచించడం లేదు.

అతని మనసంతా నిర్మల భర్తమీద చిరాకుతో నిండిపోయింది. అటువంటి భర్తంమీద నిప్పులు చెరుగుతోంది. *

(ఈవారం వారపత్రిక)